


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

# *చివరి విడత: మలి సందడి (16)*

# *(అనుమతి పాట్లు **బెర్లిన్‌లో నేను, నా కుటుంబం**)*

నగరవిహారం

శ్రీమతి నోట వెలువడిన విహార యాత్రలు అన్న మాట బాణమై గుచ్చింది.

ఈ బాణం చిత్రమైనది. అది నన్ను బాధించలేదు. బాణం వదిలిన శ్రీమతిపై జాలి పుట్టించింది.

ఎందుకంటే శ్రీమతి వాడేవి వేటగాడి బాణాలు కావు. నన్ను వేటాడే ఉద్దేశ్యమూ ఆమెకుండదు.

ఈ బాణాలకు సంబంధించి నేను సీతన్న, ఆమె పుల్లయ్య. ఆ కథేంటంటే....

మా ఊళ్లో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు పెట్టిస్తానని ఎన్నికల్లో నెగ్గాడు ఓ సీతన్న. మా ఊరివాడు దేశనాయకుడయ్యాడని ఊళ్లో ఆయనకి సన్మానం జరిగింది.

కొందరాయనకి దండలేశారు. కొందరు మాటలతో పొగిడారు.

ప్రతి ఒక్కరూ తాము చెప్పేది పూర్తి కాగానే, ‘‘సీతన్న గారికీ జై’’ అంటున్నారు. సభికులంతా జయజయధ్వానాలు చేస్తున్నారు.

ఇది చూసిన మా ఊరి పుల్లయ్యకి ఉత్సాహం తన్నుకొచ్చినట్లుంది. చటుక్కున తనూ వేదిక ఎక్కాడు.

పుల్లయ్య ఓ రైతు కూలీ. ఎప్పుడూ ఏ విషయంలోనూ ఇలా ముందుకు రాలేదు. అందుకని కొందరు వాణ్ణి అటకాయించబోయారు.

‘‘పుల్లయ్యని ఆపకండి. తన ఉత్సాహం తనది. ఏం చెబుతాడో చెప్పనివ్వండి’’ అని ప్రోత్సహించాడు సీతన్న.

‘‘మా గుడిసెకీ కాలవకీ మైలున్నర దూరం. మా ఆడదానికి నీళ్ల ఖర్చెక్కువ. నేను తెచ్చే రెండు కావిళ్లూ, అది తెచ్చుకునే నాలుగు కుండల నీళ్లూ సరిపోవు. అంతకుమించి తెచ్చుకునే ఓపిక మా ఇద్దరికీ లేదు. ఇకమీదట ఆ బాధుండదు. కావాలసినప్పుడల్లా ఇంట్లో కుళాయి తిప్పుకుంటే చాలు. ఎన్ని కుండలు కావాలంటే అన్ని కుండల నీళ్లు. సీతన్న బాబుకీ జై’’ అని గట్టిగా అరిచాడు.

ఆశ్చర్యంగా సభలో ఎవరూ జయజయధ్వానాలు పలకలేదు.

మన జనంలో పరిణతి రాలేదని అంతా అనుకుంటాం కానీ, అదెప్పుడో వచ్చేసింది.

ఎన్నికలముందు నాయకుడు చేసిన వాగ్దానాల గురించి, ఎన్నికల తర్వాత గుర్తు చెయ్యడం – బాణమేసినట్లేనని సభికులందరికీ తెలుసు.

జై కొడితే సీతన్న నొచ్చుకుంటాడని అందరికీ అనిపించినట్లుంది.

ఆ సభలో నేనూ ఉన్నాను. ఏమంటాడోనని సీతన్నని కుతూహలంగా చూస్తే, ఆయన మొహంలో బాణం తగిలిన బాధ ఏకోశానా లేదు. పుల్లయ్య అమాయకత్వం పట్ల కాబోలు జాలి కనిపించింది.

ఇప్పుడు శ్రీమతి మాటకి నా స్పందనా అదే!

శ్రీమతికి కొత్త, వింత ప్రదేశాలు ఇష్టం. చారిత్రక కట్టడాలు ఇష్టం. మ్యూజియాలు ఇష్టం. భౌతికంగా వాటిమధ్యన ఉంటూ, అక్కడి గాలి పీలుస్తూ అలాంటివన్నీ చూడ్డం ఇష్టం.

తనకిష్టమైనవన్నీ నాకూ ఇష్టమే. కానీ ఉన్నచోటనే ఉండి నా పనులు నేను చేసుకుంటూ, వాటిని ఊహించుకుని తృప్తిపడే తత్వం నాది.

తనకేం కావాలో, ఎదుటివాళ్లు తెలుసుకోవాలి తప్ప ఫలానాది కావాలని అడిగే అలవాటు ఆమెకీ లేదు, నాకూ లేదు.

అలా మేమిద్దరం కొన్ని అభిరుచుల విషయంలో ఒకరికొకరు అపరిచితులం.

పెళ్లయ్యేక నావాళ్లకు సంబంధించిన ఆర్థికపరమైన బాధ్యతల్లో నా అంతగానూ తనూ మమైకమవడంవల్ల – మా అభిరుచులకి ప్రాధాన్యమన్నది లేకుండా పోయింది.

నాకు జర్మనీ అవకాశం రాగానే, అదో కొత్త దేశమనీ, సుమారు రెండేళ్లు అక్కడ గడపడం కొత్త అనుభూతి అనీ మా ఇద్దరికీ కూడా స్ఫురించలేదు. ఆర్థికంగా నిలదొక్కుకుందుకు ఈ అవకాశం ఎంతవరకూ సహకరిస్తుందనే మా ఆలోచన!

నిజానికి తనకీ నాతో రావాలనుంది. నాతో ఆ మాటనలేదు.

తనూ నాతో రావాలని నాకూ ఉంది. మాటవరసకి కూడా తనతో నేనా మాట అనలేదు.

ఒక్కణ్ణీ జర్మనీ వచ్చేక సకుటుంబంగా అక్కడుండానికి ఆర్థికంగా నాకు వెసులుబాటేనా అని బేరీజు వెయ్యని రోజు లేదు.

మనసు సద్ది చెప్పిందో, నా సంకల్పబలం పని చేసిందో కానీ – ఆమెనిక్కడికి తీసుకురావడం వీలేననిపించింది.

అలాగని ఉత్తరం వ్రాయగానే, శ్రీమతి మొదటి స్పందన ''ఎంచక్కా కొత్త కొత్త దేశాలు చూడొచ్చు'' అని.

ఆమె ఆ మాట యథాలాపంగానో, సూచన ప్రాయంగానో అందని నేననుకున్నాను.

ఓ బాపు కార్టూన్లో, ఓ ముసలాయన 'పళ్లు నొప్పి పెడుతున్నాయే' అని భార్యతో అంటాడు. దానికామె, 'పోదురూ బడాయి. పళ్లు అని బహువచనం కూడాను' అంటుంది.

'కొత్త కొత్త దేశాలు' అని బహువచనం కూడాను – అనుకున్నాను శ్రీమతి జవాబు చూసి.

జర్మనీకి ఏరోఫ్లోట్ విమానంలో రావడం వల్ల – తను కనీసం మాస్కో విమానాశ్రయమైనా చూసింది.

నేను లుఫ్తాన్సాలో నేరుగా జర్మనీలోనే దిగాను. అంటే ఈ ప్రయాణంలో నేను చూసింది ఒక్కటే దేశం.

తనిక్కడికి వచ్చేక నేనా మాట తనతో అని అసూయ నటించాను కూడా.

అప్పుడు తను, ''మీరు జర్మనీలో ఫ్రాంక్‌ఫుర్ట్ విమానాశ్రయం చూశారు. ఊళ్లయితే హానోఫర్, ల్యూనబర్గ్, హాంబుర్గ్ చూశారు. ఇప్పుడు బెర్లిన్‌లో ఉన్నారు. నాకిక్కడ బెర్లిన్ తప్ప మరో ఊరు తెలియదు'' అంది.

అది నేనన్నదానికి కేవలం సమాధానం. కానీ ఆమెని ఊళ్లు తిప్పలేకపోతున్నానన్న అపరాధభావమొకటి నాలో ఉందిగా – అందుకని తన మాట జవాబులా కాక రిటార్టులా తోచింది.

ఆతర్వాత మామధ్య మళ్లీ ఊళ్లు తిరిగే ప్రస్తావన రాలేదు.

ఇదిగో, ఈ రెసిడెన్స్ పెర్మిట్ వచ్చేకనే మళ్లీ....

రెసిడెన్స్ పెర్మిట్ మమ్మల్ని విడిపోకుండా ఆపగలదు కానీ ఆర్థికంగా కొత్త ప్రయోజనాలేమివ్వదు.

ఇక్కడున్నంతకాలం ఇద్దరూ కలిసుంటాం. తర్వాత కలిసి ఇండియా వెళ్లిపోతాం.

ఈ మధ్యలో విహారయాత్రలవంటివి పెట్టుకుంటే మా బడ్జెట్ దెబ్బ తింటుంది.

నిజంగా దెబ్బ తింటుందో లేదో కానీ, మధ్యతరగతి బాధ్యతల బరువుని మనస్ఫూర్తిగా స్వీకరించిన మా మనస్తత్వంవల్ల కూడా అలా అనిపిస్తూండి ఉండొచ్చు.

శ్రీమతి విహారయాత్రల ప్రస్తావన తేగానే, తనలో ఆ ఆలోచన తప్పించాలనుకున్నాను.

తన మనసు నొచ్చుకోకూడదు. అందుకని ఓ క్షణం ఆలోచించి, ''మనవంటి గొప్ప ప్రేమికులకు విహారయాత్ర ఎలా ఉండాలో – గుండమ్మకథ సినిమాలో పింగళివారు ఓ పాటలో మహా చక్కగా వినిపించారు. అదే మనకి ఆదర్శం. నీ ఉద్దేశ్యమూ అదే కదూ!'' అన్నాను.

నేనేం చెబుతున్నానో శ్రీమతికి అర్థం కాలేదు, ''ఏ పాట?'' అంది వెంటనే.

చాలామందికిలాగే ఇష్టమైన పాటలు పాడుకోవడం నాకిష్టం.

మన ఇష్టం ఇతరులకి కష్టం కలిగించకూడదని, నా ఇష్టాన్ని ఎక్కువగా బాత్రూంకే పరిమితం చేస్తుంటాను.

ఐతే అప్పుడప్పుడు పాట వినిపించడానికి వచ్చే ఇలాంటి అవకాశాలు వదులుకోను.

''ప్రేమ యాత్రలకు బృందావనమూ నందనవనమూ ఏలనో, కులుకు లొలుకు చెలి చెంతనుండగా వేరే స్వర్గము ఏలనో'' అని రాగయుక్తంగా పాడాను.

స్పందన శ్రీమతినుంచి వస్తుందనుకున్నాను.

కానీ నేను పల్లవి పూర్తి చేశానో లేదో, ''అమ్మా, నాన్నగారు ట్యూను తప్పు పాడుతున్నారు'' అంది పాప.

తండ్రివల్ల తప్పు జరిగితే నేరుగా చెప్పలేక తల్లికి చెప్పడం చాలామంది పిల్లలకు మామూలే.

ఇది పురుషాధిక్య సమాజమనడానికి స్త్రీవాదులే అక్కర్లేదు. మన పిల్లలే చాలు.

ఇక పాప విషయానికొస్తే సంగీతపరంగా అది మామూలుది కాదు.

మూడేళ్ల వయసుకే క్లిష్టమైన సినీగీతాల్ని స్క్రిప్టులో అక్షరం పొల్లు పోనీదు.

ఆపైన ట్యూనులో శ్రుతిలయలు తప్పకుండా పాడగలిగిన సంగీతావగాహన జన్మతః అబ్బిన అదృష్టం దానిది. ఏ ప్రొఫెషనల్ సింగర్ ఇంట్లోనే పుట్టి ఉంటే ఈ వయసుకే సినిమాల్లో పాటలు పాడి ఉండేది.

రేడియోలోనూ, గ్రామఫోను రికార్డుల్లోనూ పాటలు వినడం పాపకి అలవాటు చేసింది నేనే!

పాపకి పొద్దం వచ్చినప్పట్నించీ ఇంట్లో పాటలు హమ్ చెయ్యాలన్నా భయపడాల్సిన పరిస్థితొచ్చింది నాకు.

చంటిది, దానికేం తెలుసని కొట్టిపారెయ్యడానికి లేదు. టేపు రికార్డర్ కొన్నాక, సరదా కొద్దీ కొన్ని పాటలు పాడి రికార్డు చేసుకున్నాను. దాంతో నా గానచాతుర్యంమీద నాకూ స్పష్టమైన అవగాహన వచ్చింది.

అంతమాత్రాన పాడాలన్న కాంక్ష పోదు కదా! ఆపద్ధర్మంగా నేనే పాటలు వ్రాసుకుని స్వంత ట్యూన్సు కట్టుకుని పాడుకోవడం మొదలెట్టాను.

నా పాటలు పాపకి నచ్చి తనూ పాడేది. ఐతే నా పాటనే నేను రెండోసారి పాడితే షరా మామూలుగా ట్యూను మారిపోయేది. పాప వెంటనే, తప్పు పాడుతున్నానని అభ్యంతరపెట్టేది.

మనసులో చిన్నబుచ్చుకున్నా పైకి మాత్రం తడబడకుండా, ''అప్పటికా ట్యూను నచ్చింది. దానికంటే ఇది బాగుందనిపించింది. అందుకని మార్చాను'' అని పాపకి సద్ది చెప్పాను.

అలా నాలుగుసార్లు ట్యూనుని మెరుగుపర్చేక – ''ఎన్నిసార్లు మారుస్తారూ?'' అని పాప విసుక్కుంది.

దాంతో పాప ఎదురుగుండా నా స్వంత ట్యూన్సుని రెండోసారి పాడకుండా జాగ్రత్త పడుతున్నాను.

ఇప్పుడు ఈ ప్రేమయాత్రల పాటతో పాపకి మళ్లీ దొరికిపోయి ఏంచెప్పాలా అని ఆలోచిస్తుంటే – శ్రీమతి నవ్వి, ''నాన్నగారు పాడలేదు. వినిపించారంతే!'' అని పాప దగ్గర తాత్కాలికంగా నా పరువు నిలబెట్టింది.

‘‘ఏమిటో, నాన్నగారెప్పుడూ పాట వినిపించడమే కానీ పాడరు’’ అని ఓసారి గొణుక్కుంది పాప.

పాప అమాయకంగానే గొణుక్కున్నా నాకది పంచ్ డైలాగులా తగిలింది.

శ్రీమతి దాన్ని దగ్గరగా తీసుకుని బుగ్గలు పుణికింది. చూడ్డం మాత్రం నన్నే.

చూసి ఊరుకోలేదు, ‘‘తర్వాత చరణం కూడా వినిపించరూ’’ అంది – ‘వినిపించరూ’ అన్న పదాన్ని కాస్త నొక్కి పలకడంలో చిలిపితనాన్ని ప్రదర్శిస్తూ.

పాప వెంటనే, ‘‘ఈసారి వినిపించడానికి వీల్లేదు. పాడాల్సిందే’’ అంది.

ఇందాకా కూడా నేను పాడానని దానికెలా చెప్పేది?

‘‘రెండో చరణం గుర్తు రావడం లేదు’’ అన్నాను తప్పించుకుందుకు.

‘‘నాకు గుర్తుంది, చెబుతున్నా వినండి’’ అంది శ్రీమతి – తాను పాడడం లేదనీ, వినిపిస్తున్నాననీ ముందే జాగ్రత్త పడుతూ.

పాప సంగీతజ్ఞానం కాదు కానీ – దానిముందు పాడ్డానికి శ్రీమతికీ భయమే!

శ్రీమతి చెప్పేంతలో పాప తనే అందుకుని, ‘‘తీర్థయాత్రలకు రామేశ్వరము కాశీ ప్రయాగలేలనో, ప్రేమించిన పతి ఎదుటనుండగా వేరే దైవము యేలనో’’ అని రాగయుక్తంగా పాడి గొప్పమొహం పెట్టి చూసి, ‘‘ఇప్పుడు పాడండి’’ అంది.

ముచ్చటేసింది. చటుక్కున దగ్గరగా తీసుకుని, ‘‘ఇంత బాగా పాడేవు. నీ పాట ఇంకా వినాలనుంది. మొత్తం పాడవూ!’’ అన్నాను.

మరిపించాలని కాదు, నిజంగానే ఆ మాట అప్రయత్నంగా అన్నాను.

శ్రీమతి ఊరుకుంటుందా, ‘‘తప్పించుకుందుకు వీల్లేదు. మీరిప్పుడు పాడాల్సిందే’’ అని నొక్కించింది.

రాగింగుని ప్రొఫెషనల్ కాలేజీల్లో నిషేధించగలరేమో – భర్తలముందు భార్యల విషయంలో కుదరదు.

తప్పుతుందా? అసహాయంగా ఓసారి స్క్రిప్టు మననం చేసుకున్నాను.

మహానుభావుడు పింగళి వారు. తప్పించుకుందుకు దారి స్క్రిప్టులోనే చూపించాడు.

అది ఆసరా చేసుకుని, ‘‘ఆ చరణం ఆడవాళ్లని తీర్థయాత్రలకి పరిమితం చేస్తుంది. పతిని సతికి దేవుణ్ణి చేస్తుంది. అది నాకు నచ్చదని నీకూ తెలుసు’’ అన్నాను.

మాట మార్చడం కాదు.

పతిసేవలే సతికి జీవనలక్ష్యమనే పాత సినిమా పాటలు చాలా ఉన్నాయి.

వాటి భావాన్ని నేను నిరసించడం శ్రీమతికి అనుభవమే.

‘‘పాట పాడకుండా బాగా తప్పించుకున్నారు’’ అని నవ్వింది శ్రీమతి.

తప్పించుకున్న మాట నిజమే కానీ, పాటనుంచి కాదు, విహారయాత్రలనుంచి!

అలాగని బయటపడకుండా, ‘‘ఇందులో తప్పించుకున్నదేముంది? నువ్వు విహారయాత్రలన్నావు. అందుకు నేనీ పాటని స్ఫూర్తి చేసుకున్నాను. విహారయాత్రకి ఊళ్లూ దేశాలూ తిరగాలా? మనిద్దరం ఒకరిపక్కన ఒకరుంటే అదే విహారయాత్ర!’’ అన్నాను.

శ్రీమతికి అర్థమైంది, ‘‘ఔను నిజమే! ఇంట్లో వంట చేసుకు తింటున్నాం. అదో విహారయాత్ర! షాపుకెళ్లి ఉప్పూ, నూనే, బియ్యం కొనుక్కొస్తున్నాం. అదో విహారయాత్ర!’’ అని క్షణమాగి, ‘‘పిల్లల్నేసుకుని మీతో ఆఫీసు కొద్దామనుకుంటున్నాను. మీ ప్రొఫెసరుగారి అనుమతి తీసుకోండి’’ అంది.

‘‘ఎందుకు?’’ అన్నాను ట్యూబులైటు వెలక్క.

''రోజూ ఆఫీసుకెళ్లడం విహారయాత్ర ఔతుందని'' అనేసి, నేను నొచ్చుకుంటానని జాలేసిందేమో ఆ వెంటనే నవ్వేసింది.

మా మాటల్లో తమకి ఉత్సాహం కలిగించేవేం లేదనిపించిందేమో – పిల్లలు బొమ్మలతో ఆడుకుందుకు పక్కకి వెళ్లారు.

''సారీ వసూ! నా ఉద్దేశ్యం అది కాదు. నేను చెప్పేది కాస్త విను'' అన్నాను.

దెప్పడం ఐపోయింది కాబట్టి – తనకీ మనసు కాస్త తేలికపడి నే చెప్పేది వినే మూడ్‌కి వచ్చింది.

''మనం భువనేశ్వర్లో ఉంటూ ఏం చేసేవాళ్లం? సినిమాలు, షాపింగు – అంతేగా! కానీ చుట్టాలు, స్నేహితులు – కేవలం నందనకానన్, లింగరాజు మందిరం, రాజారాణి ఆలయం, ఖండగిరి–ఉదయగిరి గుహలు, అశోకుడి శిలాశాసనం వగైరా ప్రదేశాలు చూడ్డంకోసమే మనింటికొచ్చేవారు. చూసేక ఏమనేవారు?'' అన్నాను.

'మీరు చాలా గొప్ప యాత్రాస్థలంలో ఉంటున్నారు. శ్రద్ధగా చూడాలంటే – ఈ ఊళ్లో కనీసం ఆర్నెల్లుండాలి. ఏంచూసినా ఇలా హడావుడిగా కాక శ్రద్ధగా చూసే అదృష్టం మీకుంది' అని ఒకరా, ఇద్దరా చాలామందే అన్నారు. వాళ్లు చెప్పేదాకా మాకా ఊరు యాత్రాస్థలమన్న స్పృహ కలుగలేదు. కలిగేక కూడా ముఖ్యమైన ప్రదేశాలు కొన్నింటిని మొదటిసారి చూడ్డానికే ఏళ్లు పట్టింది.

శ్రీమతికి ఆ విషయం గుర్తు చేశాక, ''భువనేశ్వర్ జనాభా లక్ష దాటిందేమో! మరి బెర్లిన్ జనాభా – తూర్పు పశ్చిమాలు కలిపి ముప్పై లక్షలు పైన. స్థలం చూస్తే భువనేశ్వర్‌కి ఐదు రెట్లు పైన. అసలే ఇక్కడ చూడాల్సిన వింతలు ఎన్నో ఉంటే, రెండవ ప్రపంచయుద్ధానికి గురైన నగరం కావడంవల్ల మరిన్ని అయ్యాయి. అవి చూడ్డానికి ప్రపంచంలో ఎక్కడెక్కణ్ణించో యాత్రీకులు విరగబడి వస్తూంటారు. మనకిక్కడ ఏడాదికి పైగా ఉండే అదృష్టం కలిగింది. విహారయాత్రకి ఈ నగరమొక్కటి చాలదూ మనకి!'' అన్నాను.

శ్రీమతి నవ్వి, ''ఈ మాట చెప్పడానికి పాటలు పాడాలా? ఏవేవో గుర్తు చెయ్యాలా? ఇంత డొంకతిరుగుడు లేకుండా సూటిగా మన వ్రతాల గురించి చెబితే సరిపోదా? వినాయకుడి వ్రతం చేసేటప్పుడు – పూజకి ముందు బంగారు విగ్రహం పెట్టమంటారు. అందుకు శక్తి చాలకపోతే వెండి ఐనా ఫరవాలేదంటారు. చివరికి మట్టి విగ్రహం దాకా కన్సెషనిస్తారు. ఇక్కడ ఉద్దేశ్యం బంగారాన్ని ఎక్కువ చేసి, మట్టిని తక్కువ చెయ్యడం కాదు. దేవుడి పూజ విషయానికొస్తే మట్టీ, బంగారం ఒకటేననీ, మట్టికంటే ఎక్కువ చేస్తే అది మెహర్బానీ అని సూచించడం. నేనేదో సరదాకి విహారయాత్రలన్నాను కానీ, బెర్లిన్ నగర విహారమంటే – మన తాహతుని బట్టి – అది పూజకి బంగారు విగ్రహంతో సమానం. ఈ అదృష్టాన్ని సద్వినియోగం చేసుకుందాం'' అంది.

ఆమె సహకారాన్నీ, సాహచర్యాన్నీ ఏమని పొగడను?

నాకు చిన్నప్పుడు చందమామలో చదివిన కథ ఒకటి గుర్తొచ్చింది.

ఓ గుడిసెలో అమాయకుడైన భర్త, అనుకూలవతి ఐన భార్య ఉన్నారు. వాళ్లకో ఆవుంటే భర్త దాన్ని అమ్ముకొస్తానని పట్నం బయల్దేరాడు. దారిలో ఒక మోసగాడెదురై, మాయమాటలతో నమ్మించి తన దగ్గరున్న మేకను భర్తకిచ్చి ఆవును తోలుకుపోయాడు. మరికొంత దూరం వెళ్లే మరో మోసగాడు వాడికో కోడిపుంజునిచ్చి మేకను తోలుకెళ్లిపోయాడు. మరికాస్త దూరం వెళ్లేక మరో మోసగాడు వాడి చేతిలో ఓ రూపాయుంచి కోడిపుంజుని తీసుకెళ్లిపోయాడు. అలా చివరికి ఉత్త చేతులతో ఇంటికి తిరుగుముఖం పట్టిన అతణ్ణి దారిలో ఓ బాటసారి పకలరించి విషయమడిగి తెలుసుకున్నాడు. 'నీ తెలివితక్కువతనానికి నీ భార్య మండిపడి పెద్ద రభస చేస్తుంది. ఎక్కడైనా పని చేసి నాలుగు డబ్బులు సంపాదించి అప్పుడు ఇంటికెళ్లడం మంచిది' అని సలహా ఇచ్చాడు. దానికా అమాయకుడు, 'నా భార్య నన్ను దేనికీ తప్పు పట్టదు' అన్నాడు. బాటసారికి నమ్మకం కుదరక, ఆ విషయమై నూరు వరహాలు పందెం కాసాడు. ఇద్దరూ అమాయకుడి ఇంటికెళ్లారు. అమాయకుడు అంతవరకూ తనకూ జరిగిన అనుభవాల్ని ఒకొక్కటిగా చెబుతుంటే, ఆమె అతడు చాలా తెలివిగా చేశాడని మెచ్చుకుంది. పల్లెత్తు మాట అనలేదు సరికదా, తిరిగి తిరిగి అలసి వచ్చాడని అతడికీ, అతడితోపాటు బాటసారికీ రుచికరమైన భోజనం పెట్టింది. పందెం ఓడిన బాటసారి

అమాయకుడికి నూరు వరహాలూ ఇచ్చుకుని, 'అనుకూలవతి ఐన భార్య – భర్తకు ఎన్ని నష్టాలు కలిగినా అవలీలగా పూడ్చగలదు' అని వెళ్లిపోయాడు.

ఆ బాటసారి మాటల్లోని నిజం శ్రీమతి ద్వారా నాకు ప్రత్యక్షానుభవం.

కొన్ని బాధ్యతలు, కొంత అమాయకత్వం ఆర్థికంగా నా పరిస్థితిని క్లిష్టం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అన్నింటినీ అధిగమించానంటే అందుకు కారణం శ్రీమతి మాత్రమే!

నగరవిహారాన్నే విహారయాత్రగా భావించడం వరకూ సరే! ఆ పరిణామం ఆహ్లాదకరంగా జరగడం గమనార్హం.

ఇద్దరం ఓ 'రెయిజే బ్యూరో' (టూరిస్ట్ ఆఫీసు)నుంచి తెచ్చుకున్న కరపత్రాలను స్టడీ చేసి నగరంలో చూడాల్సిన ప్రదేశాల్ని ఓ కాగితంమీద నోట్ చేసుకున్నాం.

అప్పుడు గమనించిందేమిటంటే, ముఖ్యమైన యాత్రా ప్రదేశాలు చాలావరకూ మా చుట్టుపక్కలే ఉన్నాయి.

డాయిచే ఓపర్ మన రవీంద్రభారతిలాంటిది. మా ఇంటినుంచి ఐదారు నిముషాల కాలినడక అంతే! రోజూ చూస్తూనే ఉంటాం.

డాయిచే ఓపర్ ఉండే వీధిలోనే రోడ్డుకి అటుపక్కగా చార్లొటెన్ బర్గ్ పాలేస్ ఉంది. భవనంలో మ్యూజియం, ఆక్వారియం ఉన్నాయి. భవనం చుట్టూ అందమైన పెద్ద పార్కు. మాకు రోజూ కనబడుతూనే ఉంటుంది.

బ్రాండెన్‌బర్గ్ గేటు – రెండు జర్మనీలకు సరిహద్దు ద్వారం. అది మా ఆఫీసుకి చాలా దగ్గర. రోజూ కనబడుతూనే ఉంటుంది. సాయంత్రాలు మావాళ్లతో నడుచుకుంటూ అక్కడికి చాలాసార్లే వెళ్లాం.

అక్కడికి దగ్గర్లోనే ఉన్న రెయిష్‌టాగ్ భవనాన్ని కూడా మేము చాలాసార్లు చూశాం. దాన్ని హిట్లర్ భవనం అని కొందరు మాకు చెప్పారు కానీ – అది రాజులు కొలువు తీరే సభాభవనమని కరపత్రంలో రాసుంది.

ఆ దగ్గర్లోనే కాంగ్రెస్ హాలే (కాంగ్రెస్ హాల్) ఉంది. టోపీ ఆకారంలో చిత్రంగా ఉండడంవల్ల మేము దాన్ని ప్రత్యేకంగా గమనించడం జరిగింది.

కైజర్ విల్‌హెల్మ్ మెమోరియల్ చర్చి మా ఇంటికి 3–4 కిలోమీటర్ల దూరంలో కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ ఏరియాలో ఉంది. ఊబాన్లో వెడితే చేరుకుందుకు ఐదు నిముషాలు కూడా పట్టదు. రెండో ప్రపంచయుద్ధంలో బాంబుల దాడికి గురి కావడంవల్ల పైభాగం కొంత శిథిలమైంది. ఆ దారుణానికి గుర్తుగా శిథిలభాగాన్నలాగే ఉంచి మిగతా చర్చిని మరమ్మతు చేసి ఆధునికంగా తయారు చేశారు. చిత్రంగా కనబడే ఆ భవంతిని కూడా అక్కడ షాపింగుకి వెళ్లినప్పుడల్లా చూస్తూనే ఉంటాం.

ఐరోపా సెంటర్ ఓ పెద్ద షాపింగ్ సెంటర్. అదీ ఆ ప్రాంతంలోనే ఉంది. ఇరవైఒక్క అంతస్తుల పెద్ద భవనమని గొప్పగా చెప్పేవారు. పై అంతస్తుమీద ఓ చక్రం తిరుగుతూ చాలా దూరం కనిపించేది. మా పాప ఆ చక్రాన్ని చుసినప్పుడల్లా 'ఐరోపా సెంటర్' అని అప్రయత్నంగా అనేసి తన పరిజ్ఞానాన్ని ప్రదర్శించడం మాకొక తీపి జ్ఞాపకం.

జీగే జౌలే (విజయస్తూపం) నగరంలో ఎక్కణ్ణించి చూసినా కనిపించే ఓ అపురూపం. దానిమీద ప్రతిష్ఠాపితమైన 27 అడుగుల దేవతామూర్తి బెర్లిన్ నగరవాసుల్ని దీవిస్తున్నట్లు అనిపిస్తుంది. అదీ రోజూ కననదుతూనే ఉంటుంది.

''ఎంత అదృష్టవంతులం? గొప్ప యాత్రా ప్రదేశాల పక్కనున్నాం. ఇక్కడ చుట్టాలుండి ఉంటే – తిరుపతిలో ఉండే వారి ఇళ్లకంటే రద్దీగా ఉండేది మనిల్లు'' అంది శ్రీమతి.

''ఔను. ఇక్కడ మనకి చుట్టాల్లేకపోవడం అదృష్టమే'' అన్నాను.

''ప్రతి మాటకీ బొరుసును చూపించడం అలవాటైపోయింది మీకు'' అని ముచ్చటగా విసుక్కుని, ''అదృష్టముంటే సరిపోదు. అనుభవించే యోగం కూడా ఉండాలి'' అంది శ్రీమతి.

''అంటే?'' అన్నాను.

''భాగవతం పుస్తకం చాలాసార్లే చూసాను. అందులో పద్యాలు కొన్ని విన్నాను. దాంతో భాగవతం చదివినట్లేనా?'' అందామె.

ఆమె ఉద్దేశ్యం అర్థమైంది.

యాత్రాప్రదేశాల్ని దూరాన్నుంచి ఎవరింటినో చూసినట్లు చూడ్డం కాదు. దగ్గర్నుంచి వాటి ప్రాముఖ్యం అవగాహనకొచ్చేలా గమనించాలి.

ఒక ప్రముఖ స్థలాన్ని చూసినప్పుడు అక్కడో ఫొటో దిగితే సరిపోతుందనుకునే యాత్రాసంస్కృతి నాది.

దానికి, ''అది మీరక్కడికెళ్లినట్లు సాక్ష్యంగా పనికొస్తుందంతే!'' అంటుంది శ్రీమతి.

పురాణశ్రవణంలో పురాణసారంకంటే పుణ్యంమీద దృష్టి ఉన్నవాళ్లు ఎక్కువనీ, అందుకే మన దేశం ఇలాగుందనీ చాలా కథల్లో మేము వాపోయాం.

అది యాత్రలకూ వర్తిస్తుందని మెత్తగా చెప్పింది శ్రీమతి.

''సరే, మనమిప్పుడు దగ్గర్లో ఉన్న ప్రముఖ ప్రదేశాల్ని శ్రద్ధగా గమనించాలంటావ్'' అన్నాను.

''ఔను. అక్కడ చెట్లు పలకరిస్తాయి. గాలి ముద్దు పెడుతుంది. రాళ్లు కథలు వినిపిస్తాయి....''

శ్రీమతిలో పరవశం. అది చూడగానే, అర్జంటుగా మా యాత్ర ప్రారంభించాలనిపించింది.

''ఐతే ముందు మనం జూవలాజికల్ గార్డెన్‌తో మొదలెడదాం. అది మనకు దగ్గర్లో ఉంది. పిల్లలకు సరదాగా ఉంటుంది'' అన్నాను.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments